క్లుప్తంగా

యునాని వైద్యాన్ని వినియోగించుకోవాలి

రుద్రూర్: స్థానిక పీహెచ్‌సీలో యునాని ఆయుర్వేద వైద్యం అందుబాటులో ఉందని, ఆసక్తి ఉన్న వారు వినియోగించుకోవాలని వైద్యుడు రాఘవేంద్ర రావు తెలిపారు. శుక్రవారం పీహెచ్‌సీని సందర్శించి ఆయన మాట్లాడారు. వారంలో సోమ, బుధ, శుక్రవారం అందుబాటులో ఉంటామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స ఉంటుందన్నారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ శివారులో గల రుద్ర వెంచర్ పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాన్ని నిలిపివేయాలని గ్రీన్లాండ్స్ విల్లాస్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. శుక్రవారం మున్సిపల్ మేనేజర్ నరేందర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అక్రమ నిర్మాణం సమీపంలో మట్టి పోయడం వల్ల వర్షపు నీరు ముందుకు పోకుండా నిలువ ఉంటుందని, దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు అనీల్ రెడ్డి, కాలనీవాసులున్నారు.

బాధ్యతల స్వీకరణ

బోధన్‌రూరల్: బోధన్ మండల ప్రత్యేక అధికారిగా జిల్లా పంచాయితీ అధికారి(డీపీవో) తరుణ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని ఎంపీడీవో ఛాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించి మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు, పథకాల అమలుపై అధికారులు, సిబ్బందితో చర్చించారు.

వేల్పూర్ ప్రత్యేక అధికారిగా..

వేల్పూర్: వేల్పూర్ మండల ప్రత్యేక అధికారిగా నియమితులైన జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి శుక్రవారం వేల్పూర్ మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో బాలకిషన్, ఎంపీఈవో జావెద్ హైమద్, ఇతర అధికారులు ఆమెకు స్వాగతం పలికారు. శాలువాతో సన్మానించారు.

ఎంఈవోకు ఘన స్వాగతం

రుద్రూర్: ఉమ్మడి మండల విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా రుద్రూర్ మండల విద్యా వనరుల కేంద్రానికి వచ్చిన నాగనాథ్‌కు శుక్రవారం మండల ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండలంలోని పాఠశాలల వివరాలు తెలుసుకున్నారు. ఎలాంటి సమస్య ఉత్పన్నమైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఎంఈవో నాగనాథ్ సూచించారు. కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు, విద్యావనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు కబ్జాపై చర్యలు తీసుకోవాలి

రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్ శివారులో మల్లయ్య గుట్ట వెళ్లే పొలం బాట కబ్జాకు గురవుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు పక్కనే బోరు వేయడం వల్ల ఇబ్బందిగా మారుతోందన్నారు. ఈ విషయమై స్థానిక తహసీల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికి ఎలాంటి ఫలితం లేదని వాపోయారు. దీంతో గురువారం బోధన్ ఆర్డీవో ఆఫీస్‌లో వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. ఈ సమస్య గురించి రుద్రూర్ తహసీల్దార్ వెంకటేశం దృష్టికి తీసుకెళ్లగా.. ఫిర్యాదు రాగానే పరిశీలించానని, ఏడీ, సర్వేయర్ కోసం సిఫార్సు చేస్తామన్నారు.

కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్ నడిపిస్తే రూ.20 వేల జరిమానా

నవీపేట: రహదారిపై కేజ్‌వీల్స్‌ను నడిపిస్తే సంబంధిత ట్రాక్టర్ యజమానికి రూ.20 వేల జరిమానా విధిస్తామని ఎస్సై యాదగిరి హెచ్చరించారు. బినోలలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. రహదారులను ఛిద్రం చేస్తున్న కేజ్‌వీల్స్‌లపై యజమానులు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమానులు పోలీసులకు సహకరించాలని కోరారు.

పట్టుబడిన బియ్యానికి వేలం

రెంజల్(బోధన్): గతంలో పట్టుబడిన పీడీఎస్ బియ్యం నిల్వలకు శుక్రవారం తహసీల్ కార్యాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఇద్దరు వ్యాపారులు బియ్యాన్ని దక్కించుకునేందుకు పోటీపడ్డారు. 324 క్వింటాళ్ల బియ్యానికి కిలోకు రూ.24.60 చెల్లించి రెంజల్‌కు చెందిన వ్యాపారి దక్కించుకోగా 31 క్వింటాళ్ల బియ్యానికి కిలోకు రూ. 29.50 నిజామాబాద్‌కు చెందిన వ్యాపారి దక్కించుకున్నారు. వ్యాపారులు ముందుగా రూ. 25 వేలు డీడీ చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

రెంజల్(బోధన్): పోలీసు, ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం రెంజల్ ఠాణా ఎదుట ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. సీపీ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బోధన్ డివిజన్ ట్రాఫిక్ సీఐ చందర్‌రాథోడ్, రూరల్ సీఐ నరేష్ కుమార్, ఎంవీఐ శ్రీనివాస్, రెంజల్ ఎస్సై సాయన్నలు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాహనదారులను పట్టుకుని జరిమానాలు విధించారు. ప్రతి వారం డివిజన్‌లోని మండలాల్లో తనిఖీలు నిర్వహిస్తామని వాహనదారులు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో పెట్టుకోవాలని పోలీసులు సూచించారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టరూ!

- మిషన్ భగీరథ పైపులైన్ తవ్వకంతో ఏర్పడిన గుంతలు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు


నడిమి తండా రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లి శివారులో పెద్ద వాగు రోడ్డు నుంచి నడిమి తండా వైపు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. పెద్దవాగు రోడ్డుకు ఇరు వైపులా మిషన్ భగీరథ పైపు లైన్ తవ్వకాలు చేపట్టి పైపులు వేశారు. పంట భూముల వద్ద గుంతలు ఏర్పడినా రైతులు పూడ్చుకుంటూ సాగు చేస్తున్నారు. కాని రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా గుంతలు మరింత పెద్దగా మారుతున్నాయి. వర్షకాలం వస్తే గుంతల్లో వర్షపు నీరు నిండి మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. ఐదేళ్లుగా ఇలాంటి సమస్యనే ఎదుర్కొంటున్నారు. కాని ఆర్‌అండ్‌బి ఈ అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. ఉన్నత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అంతర్గత రోడ్ల పరిస్థితి అంతే..

పల్లెల్లో అంతర్గత రోడ్ల పరిస్థితి కూడ ఇలాగే ఉంది. మిషన్ భగీరథ కోసం సీసీ రోడ్లను ధ్వంసం చేస్తూ పైపు లైన్లు వేశారు. కానీ వాటికి మరమ్మతులు చేపట్టడం మరిచారు. దీంతో వర్షకాలంలో చినుకు పడితే చిత్తడి అవుతున్నాయి. ధ్వంసం చేసిన సీసీ రోడ్ల వద్ద మళ్లీ సిమెంట్ వేయకుండా అలానే వదిలేశారు. బాల్కొండ మండల కేంద్రంలోనే అంతర్గత రోడ్లు చినుకు పడితే చిత్తడి అవుతున్నాయి. అంటే పల్లెల్లో పరిస్థితిని చెక్కనక్కర్లేదు. మిషన్ భగీరథ, ఆర్‌అండ్‌బీ అధికారులు సమన్వయంతో తవ్వకాలు చేపట్టి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదని పల్లెల్లో ప్రజలు అంటున్నారు. అంతర్గత రోడ్లు బురదమయం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

> **మరమ్మతులు చేపడతాం**
>
> గుంతలు ఏర్పడిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపడుతాం. నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే మరమ్మతులు చేపట్టి ఇబ్బంది లేకుండా చూస్తాం.
>
> – వినీత్, ఆర్‌అండ్‌బీ ఏఈ, బాల్కొండ

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి


మాక్లూర్‌లో మొక్కలు నాటుతున్న బీజేపీ నేతలు


డొంకేశ్వర్‌లో నాటుతున్న బీజేపీ నాయకులు

మాక్లూర్: సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు అమ్మ పేరుపై మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని బీజేపీ జిల్లా కార్యదర్శి గంగోనే సంతోష్ పిలుపునిచ్చారు. జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని రహదారికి పక్కన బీజేపీ నేతలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేష్ నాయక్, చిన్నాపూర్ వినోద్, ప్రళయ్ తేజ్, రాజు పాల్గొన్నారు.

డొంకేశ్వర్(ఆర్మూర్): బలిదాన్ దివాస్ కార్యక్రమంలో భాగంగా మండల బీజేపీ నాయకులు శుక్రవారం డొంకేశ్వర్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పోతుగంటి సురేందర్, జిల్లా నాయకులు ఆరే గంగాధర్, సాగర్, రాజేశ్వర్, బాలన్న, బాబురావు, సాయికుమార్, ప్రశాంత్, మోషన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: ఏర్గట్ల మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల ఆవరణలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కస్తూర్బా పాఠశాల ఆవరణలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలనే ఉద్దేశంతో మొక్కలు నాటినట్లు పార్టీ మండల అధ్యక్షుడు ఏలేటి నారాయణరెడ్డి వెల్లడించారు. నాయకులు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.


ఏర్గట్ల కస్తూర్బా పాఠశాలలో ..

ప్రయివేటు పాఠశాలల ఆగడాలను అరికట్టాలి


వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘ నేతలు

బాల్కొండ: ఉమ్మడి బాల్కొండ మండల పరిధిలోని ప్రయివేటు పాఠశాలల్లో ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీసీ విద్యార్థి సంఘం నాయకులు ఎంఈవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకుడు వెంకటేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రయివేటు పాఠశాలలను నిర్వహిస్తున్నారన్నారు. పుస్తకాలను బయట విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎల్‌కేజీ, యూకేజీలకు అనుమతులు లేకున్న పాఠశాలల్లో నిర్వహిస్తున్నారన్నారు. నాయకులు ద్యాగ శేఖర్, బబ్లూ, యశ్వంత్, హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



భీమ్‌గల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన శుక్రవారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ప్రేమలత మాట్లాడుతూ.. వర్షాకాలంలో మురికి కాలువలలో ఎప్పటికప్పుడు మురుగు తొలగించాలని, నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కమిషనర్ రామకృష్ణ, వైస్ చైర్మన్ బాల భగత్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


మాక్లూర్‌లో నినాదాలు చేస్తున్న బీజేవైఎం నేతలు


అరెస్ట్ అయిన బీజేపీ నాయకులు

మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించాలి

మాక్లూర్: మెగా డీఎస్సీని ప్రకటించాలంటూ బీజేవైఎం నాయకులు శుక్రవారం మాక్లూర్ పోలీస్‌స్టేషన్‌లో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. బీజేవైఎం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ముట్టడికి పిలుపునివ్వడంతో పోలీసులు కొందరిని అరెస్టు చేసి మాక్లూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారు స్టేషన్‌లో కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీజేవైఎం నాయకులు శ్రీకాంత్, ప్రళయ్‌తేజ్, సురేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: మెగా డీఎస్సీ విషయమై కలెక్టరేట్ ముట్టడికి పిలుపునివ్వడంతో ఆర్మూర్ పట్టణంలో బీజేపీ, బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన బీజేవైఎం నాయకులకు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్ సంఘీబావం తెలిపారు. బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలిగోట ప్రశాంత్, ఉదయ్, భారత్, శ్రీకాంత్, అక్షయ్, ప్రమోద్‌లను అరెస్టు చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రవీణ్ కుమార్

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో శుక్రవారం నందిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో కొత్తగా వచ్చే నీరు కలుషితమయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. కలుషిత నీటితో వ్యాపించే డయేరియా వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స మొదలగు అంశాలపైన అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతలో భాగంగా హ్యాండ్ వాషింగ్ టెక్నిక్స్ గురించి పిల్లలకు వివరించారు. మంచి, చెడు స్పర్శ, సమతుల్య పోషకాహారం గురించి వివరించారు. పొగాకు, మత్తు పదార్థాలకు ఆకర్షితులయ్యే యువత తమ బంగారు భవితను ఏ విధంగా చెడగొట్టుకుంటున్నారో అన్న అంశాల గురించి వివరించారు. ఫ్రైడే డ్రైడే ప్రాముఖ్యత గురించి తెలియజేశారు కేజీబీవీ ప్రిన్సిపాల్ శాంతి కుమారి, హెల్త్ సూపర్‌వైజర్ భాస్కర్, ఆరోగ్య కార్యకర్తలు, టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



భీమ్‌గల్: పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీవో సంతోష్ కుమార్ అన్నారు. పల్లికొండలో జరుగుతున్న పారిశుధ్య పనులను గ్రామ పంచాయతీ సెక్రెటరీతో కలిసి ఎంపీడీవో సంతోష్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజూ రోడ్లు, మురుగు కాలువలను శుభ్రం చేయాలని, రోడ్లపై ప్లాస్టిక్ లేకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరించాలని సూచించారు.

పసుపు పంటపై అవగాహన


మగ్గిడిలో అంతర పంటగా సాగు చేస్తున్న పసుపు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడిలో శుక్రవారం కోరమండల్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో పసుపు పంటపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ మహేందర్ మాట్లాడుతూ.. రైతులకు పసుపు పంటలో ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు, అంతర పంటల సాగుపై అవగాహన కల్పించామన్నారు. అలాగే కోరమండల్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు నేలఆరోగ్యం, భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. కంపెనీ ప్రతినిధులు మనోజ్, సుధాకర్ రెడ్డి, పాపిరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, అభ్యుదయ రైతు నలిమెల చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్స్ అభ్యర్థుల ముందస్తు అరెస్టు


అరెస్టయిన గ్రూప్స్ అభ్యర్థులు

మోర్తాడ్: టీజీపీఎస్ కార్యాలయం ముందు గ్రూప్స్ అభ్యర్థులు ఆందోళనకు పిలుపునివ్వడంతో ఏర్గట్ల పోలీసులు ముందస్తుగా మండలంలోని గ్రూప్స్ అభ్యర్థులను అరెస్టు చేశారు. శుక్రవారం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ధర్నాలకు, రాస్తారోకోలకు వెళ్లకుండా ఉండాలని సూచించారు.

సామాజిక తనిఖీ వివరాల వెల్లడి


ప్రజావేదిక నిర్వహిస్తున్న డీఆర్‌డీవో సాయాగౌడ్

బాల్కొండ: మెండోరా మండల పరిషత్ కార్యాలయం ఎద్ద శుక్రవారం మూడో విడత సామాజిక తనిఖీ ఈజీఎస్ ప్రజావేదికను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఎస్‌ఆర్‌పీలు కొన్ని రోజులు చేపట్టిన సామాజిక తనిఖీల వివరాలను చదివి వినిపించారు. ప్రధానంగా గ్రామాల్లో ఒకరి జాబ్ కార్డులపై మరొకరు పనులకు పోవడంపై గందరగోళం నెలకొంది. కొందరు ఎఫ్‌ఏలు బినామీల పేరులతో కూలీల చెల్లింపు చేపట్టారని గుర్తించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో సాయాగౌడ్ మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో ఉపాధి పనులు పక్కాగా జరిగేల చర్యలు తీసుకోవాలన్నారు. బినామీల కార్డులపై పనులు చేపించకూడదని ఎఫ్‌ఏలను మందలించారు. విజిలెన్స్ అధికారి నారాయణ, ఎంపీడీవో వనజ, ఏపీవో పూర్ణచంద్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

బాల్కొండ: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో గత విద్యాసంత్సరం పదవ తరగతి చదివిన విద్యార్థులు ఏడుగురు ట్రిపుల్ ఐటీకీ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్ శుక్రవారం తెలిపారు. నూకల కీర్తన, సరికెల రుచిత, మ్యాక సారిక, శ్రీ చైతన్య, మాసం రక్షిత, పిట్ల శరణ్య, లక్ష్మి దేవిలు ఎంపికయ్యారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	డెస్పి కెబుల్ మీ4 (తెలుగు) – 11.40, 2.00, 4.20, 6.40, 9.00
స్క్రీన్-2 –	కల్కి ఏడీ-2898 (3డీ తెలుగు) – 10.45, 2.30, 6.15, 10.00
స్క్రీన్-3 –	కల్కి ఏడీ-2898 (తెలుగు) – 10.00, 1.45, 5.30, 9.15
స్క్రీన్-4 –	కల్కి-2898 (తెలుగు) – 11.30, 3.15, 7.00, 10.45

సమాచారం..

నేడు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

రుద్రూర్: మండల కేంద్రంలోని హన్మాన్ ఆలయంలో శనివారం శ్రీరామ రక్ష స్తోత్రం, హనుమాన్ చాలిసా సామూహిక పారాయణం ఉంటుందని మందిర కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమై అర గంటలో ముగుస్తుందని వెల్లడించారు. భక్తులు సకాలంలో హాజరు కావాల్సిందిగా వారు కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి


బోధన్ పట్టణం రాకాసిపేట్‌కాలనీలో అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి విద్య


ఆర్మూర్‌లో.. మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

సాక్షి నెట్‌వర్క్ : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమం సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. నీరు నిల్వ ఉన్నట్లయితే దోమలు పెరిగి డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచన చేశారు. బోధన్ పట్టణంలోని రాకాసీపేటలో జిల్లా ఉప వైద్యాధికారి విద్య, ఆర్మూర్ పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, కమ్మర్‌పల్లిలో చౌట్‌పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుప్రియ ఫ్రైడే డ్రైడే కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే నవీపేట మండలం మోకన్‌పల్లిలో కేజీబీవీ విద్యార్థులకు క్లస్టర్ హెల్త్ సెంటర్ సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రావ్, రెంజల్ మండలం కళ్యాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

దోమల నివారణ కోసం చర్యలు



పెర్కిట్(ఆర్మూర్): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి, డీసీవో శ్రీనివాస్, గ్రామ ప్రత్యేక అధికారులకు సూచించారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ ప్రత్యేక అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన డీసీవో శ్రీనివాస్ అధికారులు ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో సాయిరాం, ఎంపీవో శ్రీనివాస్, ఎంఈవో రాజ గంగారం, ఏపీవో సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


బషీరాబాద్‌లో.. వైద్యాధికారిణి సుప్రియ


మోకన్‌పల్లిలో కేజీబీవీ విద్యార్థులకు అవగాహన


కళ్యాపూర్ పాఠశాలలో ..

వేతనాలు చెల్లించి ఆదుకోవాలి

బోధన్: నిజాంషుగర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మల్సూర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో శక్కర్‌నగర్(బోధన్), ముంబోజిపల్లి(మెదక్) ఫ్యాక్టరీల కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు కలిసి వినతి పత్రం అందించారు. 2015 డిసెంబర్ 23న ఎన్‌డీఎస్‌ఎల్ ప్రైవేట్ యాజమాన్యం అకారణంగా లేఆఫ్ ప్రకటించి బోధన్, ముంబోజిపల్లి, ముత్యంపేట(జగిత్యాల) ఫ్యాక్టరీలను మూసివేసిందని వినతి పత్రంలో పేర్కొన్నారు. లేఆఫ్ నాటి నుంచి నెలసరి వేతనాలు ఇవ్వడం లేదని, ఆ కారణంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వేతనాలు చెల్లించి కార్మికులను ఆదుకోవాలని కోరారు.

ఆక్యుప్రెషర్ చికిత్స శిబిరం ప్రారంభం

బోధన్: లయన్స్ క్లబ్(ఆచన్‌పల్లి) ఆధ్వర్యంలో ఆచన్‌పల్లి ప్రాంతం వినాయక్‌నగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన ఆక్యుప్రెషర్ మ్యాగ్నెటిక్ అండ్ వైబ్రేషన్ చికిత్సా శిబిరాన్ని శుక్రవారం లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ వి.లక్ష్మి ప్రారంభించారు. వారం రోజుల పాటు శిబిరం కొనసాగుతుందని చికిత్స కోసం రూ.200 చెల్లించాల్సి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ బసవేశ్వర్‌రావు, కాలనీ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కేపీ శ్రీనివాస్ రెడ్డి, సుబ్బారెడ్డి, క్లబ్ ప్రతినిధులు గణపతిరెడ్డి, సత్యం, లక్ష్మీకాంత్ రెడ్డి, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం

మోర్తాడ్: పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్సీ విద్యార్థులను శుక్రవారం మాదరి అన్నపూర్ణ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాదరి రాజన్న సత్కరించారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో పదో తరగతి చదువుకుని మంచి గ్రేడ్ సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారం అందించారు. ఎంపీడీవో తిరుమల, వ్యవసాయాధికారి లావణ్య, ఎంఈవో ఆంధ్రయ్య, డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, పీఆర్‌టీయూ అధ్యక్షుడు మగ్గిడి ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

